ఆంధ్రజ్యోతి
19 మే 2008
సోమవారం
2
స్టడీ
study@andhrajyothy.com

**సివిల్స్‌లో విజయం సాధించాలన్న లక్ష్యం నిన్నటి మాట. ఆరు నూరైనా ఐఎఎస్ కావాలన్నది నేటి మాట. అందుకోసం ఎన్నిసార్లు యత్నించడానికైనా, నేటి తరం విసుగు చెందటం లేదు. నిస్పృహకు లోనుకావటం లేదు. మరో అవకాశం ఉంటే చాలు, ఆశించిన ర్యాంకు కోసం ఇనుమడించిన ఉత్సాహంతో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. పేద, గొప్ప తారతమ్యం లేనే లేవు. ఈ విషయంలో వారికి కుటుంబ సభ్యుల సహకారం బలంగా ఉండటం గమనార్హం. రెట్టించిన ఉత్సాహంతో అధ్యయనం చేసి, తుది లక్ష్యానికి వారు చేరుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత సివిల్స్‌ర్యాంకర్లలో అందుబాటులో ఉన్న వారిని సంప్రతించినా చాలు, అసలు విషయం అదేనని తెలుతుంది.**

# పట్టువదలని విక్రమార్కులు

## సివిల్స్ ర్యాంకర్ల మనోగతాలు


కార్తీక్


శ్రీధర్‌బాబు





అశ్విని


దేవీ ప్రసాద్


రఘు కిరణ్


శ్రీదేవి

### ఇంగ్లిష్ మాస్టారి సూచనే

అడపా కార్తీక్, మొదటి ర్యాంకు

మాది ఖమ్మం జిల్లా. వార్ధాలోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి ఎంబిబిఎస్ చేశాను. సైకాలజీ, జువాలజీ ఆప్షనల్స్‌తో పరీక్ష రాశాను. నాకు సివిల్స్‌లో ర్యాంకు రావడం ఇది మూడోసారి. 2004లో 166వ ర్యాంకు సాధించినా సర్వీస్‌లో చేర లేదు. 2006లో ర్యాంకు సాధించి ఐపీఎస్‌గా ట్రైనింగ్‌లో ఉన్నాను. 2007లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. 1994లో మా ఇంగ్లిష్ మాస్టర్ ఐఎఎస్ రాయమని సూచించారు. ఆయన ప్రోద్బలం మేరకే సివిల్స్ రాస్తున్నాను. పేదలకు సేవ చేయడం. వారు సంతృప్తిగా ఉండడమే నాకు ఆనందం.

### కవితలపై ఆసక్తి

– డి. శ్రీధర బాబు, అయిదో ర్యాంక్

ఇది మా నాన్నగారి ఆశయం. అయిదో యత్నంలో ఈ ర్యాంకు సాధించాను. గత ఏడాది ఆయన కన్నుమూశారు. ఈ ఏడాది ఆయన ఆశయాన్ని నెరవేర్చగలిగాను. నేను బిటెక్ కంప్యూటర్ సైన్స్ చేశాను. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, తెలుగు లిటరేచర్ నా ఆప్షనల్స్. తొలి నుంచీ నాకు తెలుగుపై ఆసక్తి. నాన్నగారు, నేను కలిసి కవితలు రాసేవాళ్ళం. అందువల్ల తెలుగుపై మెటీరియల్‌ను నేను సొంతంగా తయారు చేసుకున్నాను. డిపి అగర్వాల్ బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. నేను ఇప్పటికే ఐపిఎస్‌కు ఎంపికై శిక్షణ పొందుతున్నందున, దానిపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగారు. టూరిజం, నా హాబీ అయినా వ్యాస రచన, మహిళల సమస్య తదితరాలపైనా ప్రశ్నించారు. అదృష్టాన్ని నమ్మకూడదు. కృషినే నమ్ముకుంటే విజయం తప్పక వరిస్తుంది.

### ఆకాంక్షకు అనుగుణంగా...

– అశ్విని, ర్యాంక్ 56

బిఇ కంప్యూటర్ సైన్స్ చేశాను. దౌత్యవేత్త కావాలన్నది నా ఆకాంక్ష. అందుకు అనుగుణంగానే నేను సివిల్స్ వైపు మొగ్గు చూపాను. అవసరమైన శిక్షణ తీసుకున్నాను. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రోపాలజీ నా ఆప్షనల్స్. మూడో ప్రయత్నంలో ఈ ర్యాంక్ సాధించాను. సరైన ప్రిపరేషన్ లేకపోవడం వల్లే రెండుసార్లు ఎదురు దెబ్బలు తగిలాయి. రాయ్‌పాల్ బోర్డ్ నన్ను ఇంటర్వ్యూ చేసింది. గ్రామీణ మహిళలకు సాధికారికత, మీడియా పాత్ర, సెక్యులరిజానికి ఎదురవుతున్న సవాళ్ళు, అలీన దేశాలు తదితరాలపై ప్రశ్నించారు. ఇంటర్వ్యూ జరుగుతున్నంత సేపూ చాలా హాయిగా ఫీలయ్యాను. నిజాయతీతో జవాబులిచ్చాను. జాతీయ విషయాల కోసం 'ఇపిడబ్ల్యు', అంతర్జాతీయ అంశాల కోసం 'టైమ్' రెగ్యులర్‌గా 'హిందూ' చదివాను.

### రెండుసార్లు విఫలమైనా...

కరణం దేవీ ప్రసాద్, 68వ ర్యాంకు

గత రెండు పర్యాయాలు ఇంటర్వ్యూలో విఫలమయినప్పటికీ మూడో ప్రయత్నంలో మంచి ర్యాంకు సాధించాను. తెలుగు లిటరేచర్, జాగ్రఫి నా ఆప్షనల్స్. ఐఏఎస్ వస్తుంది. మా నాన్న మెదక్‌జిల్లా సరఫ్‌పల్లిలో విఏఓగా పనిచేస్తున్నారు. మా అమ్మ గృహిణి. ఇద్దరు సోదరులు, ఒక సోదరి ఇది మా కుటుంబ నేపథ్యం. 2002లో ఎన్‌జి రంగా యూనివర్సిటీ నుంచి ఏజి బిఎస్సీ పూర్తి చేశాను. ప్రస్తుతం గుంటూరు మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. నాకు 45 నిమిషాల సేపు ఇంటర్వ్యూ జరిగింది. త్రిపాఠి బోర్డు ఇంటర్వ్యూ చేసింది. నేను గుంటూరులో పనిచేస్తుండడంతో పొగాకుకు సంబంధించి, అలాగే మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ గురించి ప్రశ్నలు అడిగారు.

### ఆప్షనల్స్ మార్చొద్దు

కె.వి.ఎస్. చక్రధర్ బాబు, ర్యాంకు 170

బిటెక్ (కంప్యూటర్ సైన్స్) చేశాను. విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మా స్వస్థలం. రెండో యత్నంలో ఈ ర్యాంక్ సాధించాను. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్నాను. అంతకు ముందు సత్యం కంప్యూటర్స్‌లో పని చేశాను. ఆంత్రోపాలజీ, తెలుగు లిటరేచర్ నా ఆప్షనల్స్. డిపి అగర్వాల్ బోర్డ్ నన్ను ఇంటర్వ్యూ చేసింది. సుమారు 45 నిమిషాల సేపు నా ఇంటర్వ్యూ జరిగింది. పంచాయతీ రాజ్ చట్టంపై ప్రశ్నించారు. అనంతరం చట్టం అంత బాగున్నా, కింది స్థాయిలో బాధ్యులకు విధులు ఎందుకు ఇవ్వటం లేదన్నప్పుడు సమాధానం కోసం వెతుక్కోవాల్సి వచ్చింది. నేను చదివిన ఇంజనీరింగ్ కోర్సుతో మంచి ఉద్యోగం పొందనూవచ్చు. ఆదాయమూ బాగానే ఉంటుంది. అయితే ప్రజలకు సేవ చేసే అవకాశం మాత్రం సివిల్స్‌తోనే లభిస్తుందన్న విశ్వాసమే నన్ను ఈ వైపు నడిపింది. అలాగే ఆప్షనల్స్ ఎంపికలో జాగ్రత్త చాలా అవసరం. పదేపదే మార్చకూడదు.

### సాఫీగా ఇంటర్వ్యూ

– బి.జాన ట్లాంగ్‌టిన్‌ఖుమా ర్యాంకు 260

మాది మణిపూర్. అక్కడి యూనివర్సిటీలోనే ఎమ్మే హిస్టరీ చేశాను. సివిల్స్‌పై నాకు మొదటి నుంచి ఆసక్తి. మా తల్లిదండ్రులూ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. హైదరాబాద్‌లో కోచింగ్ బాగుంటుందని ఇక్కడికి వచ్చి చేరాను. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రోపాలజీ నా ఆప్షనల్స్. బాల గురుస్వామి బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. నలభై నిమిషాల సేపు ఇంటర్వ్యూ జరిగింది. ఇంటర్వ్యూ యావత్తూ సాఫీగా జరిగింది.

### మరో సారి యత్నిస్తున్నా...

ఎం. నవీన్ ర్యాంక్ 336.

బిటెక్ (ఇఇఇ) చేశాను. కామారెడ్డిలో డెప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్నాను. మూడో యత్నంలో ఈ ర్యాంకు సాధించాను. నల్గొండ జిల్లాలో నా విద్యాభ్యాసం అంతా జరిగింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రోపాలజీ నా ఆప్షనల్ సబ్జెక్టులు. బాల గురుస్వామి బోర్డ్ నన్ను ఇంటర్వ్యూ చేసింది. నేను పత్రికల్లో 'లెటర్స్ టు ఎడిటర్ కాలమ్'కు ఉత్తరాలు రాస్తుంటాను. దానిపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగారు. అలా ఇతర సాంఘిక సమస్యలనూ స్పృశించారు. మొత్తమ్మీద నా ఇంటర్వ్యూ బాగానే జరిగింది. ఇంకా మంచి ర్యాంకు పొందేందుకు మరొక సారి ప్రయత్నిస్తున్నాను.

### ఐఆర్ఎస్ రావచ్చు

బి.రఘు కిరణ్, ర్యాంకు 343

ప్రకాశం జిల్లా మాది. ఇంజనీరింగ్ చదివాను. జాగ్రఫి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్స్ నా ఆప్షనల్స్. మానాన్న డిప్యూటి సెక్రెటరీ స్థాయిలో ఉన్నారు. అమ్మ టీచర్. నాకు ఒక సోదరి ఉంది. ఇది మా కుటుంబం. నా ర్యాంకుకు ఐఆర్ఎస్ రావచ్చు. నాకు 35 నిమిషాలపాటు ఇంటర్వ్యూ జరిగింది. రాయ్‌పాల్ బోర్డులో ఉన్నాను. ఇంటర్వ్యూలో నక్సలైట్ ఉద్యమం, అమెరికా ఎన్నికలు, నానోకారు, బాల కార్మికులు మొదలైన అంశాలపై ప్రశ్నలు అడిగారు.

### దినపత్రికలు బాగా చదవాలి

యనమండ్ల దివ్య ర్యాంక్ 444

బిఇ మెకానికల్ చేశాను. సమాజానికి సేవ చేయవచ్చన్న తలంపే నన్నీ దిశగా తిప్పింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రోపాలజీ నా ఆప్షనల్ సబ్జెక్టులు. బిపి అగర్వాల్ బోర్డ్ నన్ను ఇంటర్వ్యూ చేసింది. తెలంగాణ తదితర అంశాలపై ప్రశ్నించారు. దినపత్రికలు బాగా చదివితే ఇలాంటి విషయాలకు సులువుగా సమాధానం చెప్పవచ్చు.

### రైటింగ్ ప్రాక్టీస్ ముఖ్యం

అశోక్ బాబు ర్యాంక్ 520

వరంగల్‌లోని నిట్ నుంచి బిటెక్ మెకానికల్ చేశాను. నల్గొండ జిల్లా రాజుపేట మండలంలో ఎంపిడిఓగా పని చేస్తున్నాను. తెలుగు లిటరేచర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నా ఆప్షనల్స్. సివిల్స్‌పై ఆసక్తి, అంతకు మించి నాన్నగారి ప్రభావం నన్ను ఇటువైపు మరల్చాయి. జాబ్ సెక్యూరిటీ ఉంటుందన్న ఆశతో బిటెక్ చేశాను. ఇంటర్వ్యూలో మెజార్టీ ప్రశ్నలు ప్రస్తుతం నేను చేస్తున్న జాబ్‌పైనే అడిగారు. అలాగే లోక్ అదాలత్ తదితరాలపైనా ప్రశ్నించారు. రైటింగ్ ప్రాక్టీస్ చాలా ముఖ్యం. మెయిన్స్‌కు ఇది బాగా తోడ్పడుతుంది.

### తండ్రి ప్రోత్సాహమే...

– టి.శ్రీదేవి, 602

ఇంటర్ పాస్ కాగానే ఉద్యోగంలో చేరాను. దూర విద్యా విధానంలో డిగ్రీ చేశాను. ఆపై గ్రూప్2కు ఎంపికయ్యాను. ఇప్పుడు సివిల్స్‌లో ర్యాంకు సాధించాను. రెండో యత్నంలో ఈ విజయం వరించింది.

ఈ ర్యాంకుతో కేంద్ర ప్రభుత్వ సర్వీసులో చేరవచ్చనుకుంటున్నాను. నాన్న గారి ప్రోత్సాహమే దీనంతటికీ బలంగా పనిచేసింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఆంత్రోపాలజీ నా ఆప్షనల్స్. చలం బోర్డ్ నన్ను అర్ధగంట సేపు ఇంటర్వ్యూ చేసింది. ఇంటర్వ్యూ మొదటి నుంచి నన్ను ప్రోత్సహించారు. సునామి, ఇ-గవర్నెన్స్ తదితరాలపై ప్రశ్నించారు. ఆది నుంచి నేను ఆర్ట్స్ స్టూడెంట్‌ను.

అయితే నన్ను హైడ్రోజన్ గురించి ప్రశ్నించారు. దాంతో కొద్దిగా ఇబ్బంది పడ్డాను. అంతకు మించి మరేమీ లేదు. దూర విద్యలో చదువుకున్నా పర్వాలేదు. ఎలా చదివినా కష్టపడితే సాధ్యం కానిది ఏదీ ఉండదు. ముఖ్యంగా కుటుంబ సహకారం పరిపూర్ణంగా ఉంటే, సగం బలం వచ్చినట్లే లెక్క.

### కొన్ని ప్రశ్నలు ఇబ్బంది పెట్టింది

కె.సి. నాగరాజు నాయర్, ర్యాంక్ 709

బిఎ చేశాను. సివిల్స్‌పై ఆసక్తితో ఇటువైపు మళ్ళాను. సాంఘిక సంక్షేమ విభాగంలో పని చేస్తున్న అమ్మ నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తోంది. ఎస్టీనైన నేను మూడో యత్నంలో ఈ ర్యాంకు సాధించాను. డిపి అగర్వాల్ బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది.

ఎస్వీ యూనివర్సిటీ నేప థ్యంతో మొదలుకుని నక్సల్స్ సమస్య తదితరాలన్నింటిపై ప్రశ్నించారు. రాష్ట్రాల పునర్విభజనపై అడిగిన ప్రశ్నలు మాత్రం నన్ను చాలా ఇబ్బంది పెట్టాయి. మేడే రోజున నా ఇంటర్వ్యూ జరిగింది. దాంతో మేడే పైనా అడిగారు. అలా దాదాపు 30 నిమిషాల సేపు ఇంటర్వ్యూ జరిగింది.

**2007 అక్టోబర్- నవంబర్‌లో జరిగిన రాత పరీక్షలు, ఇటీవల జరిగిన ఇంటర్వ్యూల తరువాత మొత్తం 734 అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇందులో 286 మంది జనరల్ కేటగిరీ చెందినవారు (ఇందులో 12 మంది వికలాంగులు), 266 వెనకబడిన కులాలవారు (ఇందులో 5 వికలాంగులు), 128 మంది షెడ్యూలు కులాలకు చెందినవారు (ఇందులో 5 వికలాంగులు), 54 షెడ్యూలు తెగలవారు ఉన్నారు. ఈ సారి వెలువడిన పోస్టుల్లో 111 ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, 20 ఇండియన్ ఫారెన్ సర్వీస్, ఇండియన్ పోలీస్ సర్వీస్ 103, సెంట్రల్ సర్వీస్ గ్రూప్- ఏలో 458 పోస్టులు, గ్రూప్-బి సర్వీసులో 42 పోస్టులు ఉన్నాయి. యూపిఎస్‌సి కొత్త నిర్ణయం తీసుకుంది. ఫలితాలు ప్రకటించిన 15 రోజుల తరవాత మార్కులు అందజేయాలని నిర్ణయించింది.**